ఆటో రిక్షా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నస్పూర్, జూన్27 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ మండల ఆటోరిక్షా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు తూముల నరేశ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఆటో రిక్షా వెల్ఫేర్ అసోసియేషన్ నస్పూర్ గౌరవ అధ్యక్షులుగా భూపతి శ్రీనివాస్, మండల అధ్యక్షులుగా బద్రీ శివ కుమార్, ఉపాధ్యక్షులుగా తిప్పారపు రమేశ్, చతాల రామన్న, మండల రాజు, ప్రధాన కార్యదర్శిగా బి. శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎండీ షకీల్, ముంజం సంతోష్, కోశాధికారిగా మాదుగుల శ్రావణ్, కార్యవర్గ సభ్యులుగా మరో నలుగురిని నియమించారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

హాజీపూర్,జూన్27(ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీశ్‌రాజు సందర్శించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలపై వైద్యురాలు లహరితో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంఎచ్‌వో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్ర పరిధిలోని ప్రభావిత గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లోని ఆశ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ జింక్ ప్యాకెట్లను అందుబాటు లో ఉంచాలని తెలిపారు. ఐరిష్‌తో గర్భవతుల వివరాలను గుర్తించి ముందస్తు చర్యలను చేపట్టి వందశాతం గర్భవతుల నమోదు, పిల్లలకు సరైన సమయంలో టీకాలు వేయాలని ఆదేశించారు. ప్రతి వారం రెండు రోజుల పాటు డ్రైడే పాటించాలని అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసాద్, ఎన్‌సీడీ శివప్రతాప్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, హెచ్ఈవోలు నాందేవ్, లక్ష్మణ్ స్వామి, రఘుపతిలు పాల్గొన్నారు.

30లోగా రేషన్ బియ్యం తీసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రేషన్‌కార్డు దారులు ఈనెల 30లోగా రేషన్ సన్నబియ్యం తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు ఒకప్రకటనలో తెలిపారు. జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ జరుగుతుందని, ఈ నెల 30వరకు పంపిణీ ఉంటుందని, గడువు పొడగించడం జరగదని తెలిపారు.



ముమ్మరంగా వ్యవసాయ పనులు

- జిల్లాలో 3.18 లక్షల ఎకరాల్లో సాగు...
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు...

నస్పూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : వానా కాలం పంటల సాగు పనులు జోరందుకున్నాయి. వ్యవసాయ పనులతో రైతులు, కూలీలు బీజీగా ఉన్నారు. అడపతడపా కురుస్తున్న వర్షాలకు పంట చేన్లను దున్ని విత్తనాలు విత్తే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వానా కాలం సీజన్‌లో జిల్లాలో పత్తి, వరి, మొక్క జొన్న, కంది, పెసర, మినుములు తదితర పంటల సాగు దాదాపు 3.18 లక్షల ఎకరాల్లో సాగు అవుతోందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. దీనికి అనుగుణంగా విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే రైతులు అవసరమైన విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసుకుని పంటల సాగుపై దృష్టి సారించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులు సాగు చేసే పంటల సాగు, దిగుబడులపై సూచనలు, సలహాలను ఇచ్చారు. అధిక దిగుబడులపై చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించి దిగుబడులు పెంచుకోవాలని అవగాహన కల్పించారు. నాణ్యత కలిగిన విత్తనాలు, పురుగు మందులను మాత్రమే కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఆశించిన విధంగా సకాలంలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ఈ యేడు రుతుపవణాలు కాస్త ముందుగానే వచ్చినా ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. తొలకరి వర్షాలకే రైతులు పత్తి విత్తనాలు విత్తడంతో సమృద్ధిగా వర్షాలు పడి వ్యవసాయ రంగంలో సాగు చేసిన పంటల దిగుబడి ఆశించిన విధంగా లాభాలు రావాలని రైతన్నలు గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు.

● జిల్లాలో సాగు విస్తీర్ణం....

మంచిర్యాల జిల్లాలో పత్తి, వరి, కంది, మొక్క జొన్న, పెరస, మినుములు తదితర పంటలు 3,18,934 ఎకరాల్లో సాగు కానుంది. పత్తి పంట 1.58 లక్షల ఎకరాలు (1,58,161 లక్షలు), వరి 1.58 లక్షల ఎకరాలు (1,58, 753 లక్షలు), కంది 1054 ఎకరాలు, మొక్కజొన్న 531 ఎకరాలు, ఇతర పంటలు 435 ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నారు. జిలుగ, జనుము విత్తనాలను సబ్సిడీ ద్వారా రైతులకు అందిస్తోంది. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి..

(తరువాయి 7లో..)

కల్వర్టుల వద్ద... జర జాగ్రత్త

- గుంతల రోడ్లపై రాకపోకలకు అవస్థలు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

6

క్లస్టర్ విరడగంతో నిలిచిన రైళ్లు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా కూనారం ఆర్వోబీ వద్ద క్లస్టర్ విరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఖాజీపేట, బల్లార్షా రైల్వే మార్గంలో ఎక్కడికక్కడ రైళ్లు నిలిచిపోయాయి. అధికారులు ఘటన స్థలానికి చేరుకుని మరమ్మతులు చేస్తున్నారు. ఆర్‌వోబీ నిర్మాణంలో భాగంగా ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేసేందుకు నిర్మించిన క్లస్టర్ విరిగి పోవడంతో పనులు నిలిచిపోయాయి. క్లస్టర్ పూర్తిగా విరిగితే పెను ప్రమాదం ఉండేది. ఈ నేపథ్యంలో దాదాపు 15 రైళ్లు ఆగిపోయాయి. మంచిర్యాల, పెద్దపల్లి, కొలనూరు, జమ్మికుంట తదితర ప్రాంతాల్లో రైళ్లను నిలిపివేశారు. సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ రైల్వేస్టేషన్ వద్ద నిలిచిపోయింది. ఇంకా పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు సైతం నిలిచిపోయాయి. దీంతో ప్రయాణీకులు రోడ్లపైకి వచ్చి ఆటోలు, బస్సుల్లో ప్రయాణించారు.

సరదా.. కారాదు విషాదం

- పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి
- క్వారీలో ప్రమాదాల నివారణకు కొలనుకు కంచే నిర్మించాలి

7

ఆలయం పక్కన.. అపరిశుభ్రం

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



సాయిబాబా ఆలయం సమీపంలో వేసిన పిచ్చి మొక్కలు

చెన్నూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని షిర్డిసాయి బాబా ఆలయం పక్కన అపరిశుభ్రం తాండవిస్తోంది. గుడి పరిసర ప్రాంతాల్లోని పిచ్చిమొక్కలను తొలగించి అక్కడ పడేయడంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసులు మున్సిపల్ సానిటరీ అధికారికి శుక్రవారం సమాచారం అందించినా స్పందించలేదన్నారు. మున్సిపల్ ట్రాక్టర్ రాకపోవడంతో చెత్త అలాగే ఉండిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ రావాల్సిన చెత్త వాహనం కూడా సక్రమంగా రావడం లేదని, దీంతో ఇండ్లలో చెత్త పేరుకుపోతేందని, తద్వారా రోగాలు వస్తున్నాయని వాపోతున్నారు. ఎంతో శుభ్రంగా ఉండాల్సిన ఆలయ పరిసర ప్రాంతం ఇలా పిచ్చి మొక్కలతో దర్శనం ఇస్తుండడంతో భక్తులు, స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

భూగర్భ జలాల పనుల పరిశీలన



చింతలపల్లి వద్ద నీటి కుంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాంబాబు

చెన్నూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 30 గ్రామపంచాయతీల్లో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన 46 వివిద రకాల అభివృద్ధి పనులను శుక్రవారం కేంద్ర భూగర్భ నీటి బోరు శాస్త్రవేత్త రాంబాబు పరిశీలించారు. సంబంధిత పథకం కింద వివిధ గ్రామాల్లో నీటి కుంటలను నిర్మించగా వాటి ప్రగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఫారెస్టు ట్రెంచ్, చిన్న నీటి కుంటలు, ఇంకుడుగుంతల నిర్మాణాలు, భూగర్భ రీచార్జ్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రాంబాబు మాట్లాడుతూ భూగర్భ రీచార్జ్‌ల నిర్మాణాల వల్ల భవిష్యత్‌లో భూగర్భ జలాలు అడుగంటకుండా ఉంటాయన్నారు. అనం తరం ఆయనను ఎంపీడీవో కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, నోడల్ అధికారి సదానందం, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్ సత్యనారాయణ, చంద్రశేఖర్, డీఆర్‌పీ రాజ్ కుమార్, ప్లాంటేషన్ అధికారులు శ్రీనివాస్, కుమారస్వామి, మధు, టీఏలు మహేశ్వర్‌రెడ్డి, రవీం దర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్ / క్రైమ్ జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : బీసీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడు తూ బీసీల సమస్యలను పరిష్కరించాలని జాతీయ బీసీ కమీషన్ చైర్మన్ హంసరాజ్ గంగరమహిర్‌కు లేఖ రాశామన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, రెండు లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతులు, బీసీల్లో రోస్టర్ విధానం అమలు చేసి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దు చేయాలని, జనాభా ప్రతిపాదిక బడ్జెట్ కేటా యించాలని డిమాండ్ చేశారు.

సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్, నాయకులు తుల మధుసూదన్, కర్రె లచ్చన్న, గజెల్లి వెంకన్న, భీంసేన్, బిక్షపతి, సతీష్, సల్మాన్‌ఖాన్, అశోక్, ప్రభాకర్, కిష్టయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమణమూర్తి

దండేపల్లి జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏఏ సంస్థలు ఉంటాయి, ఎవరెవరు ఉంటారు, ఏసంస్థ ఏ పనులు నిర్వహిస్తూరు అనే విషయాలపై దండేపల్లి మండలం గుడిరేవు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలిశెట్టి బుచ్చన్న ప్రత్యక్ష తీసుకవెళ్లి వారికి అవగాహన కల్పించారు. శుక్రవారం దండేపల్లి తహసీల్దార్, మండల పరిషత్ కార్యలయం, పోలీసుస్టేషన్, విద్యవనరుల కేంద్రం, పశువైద్యాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంచ పోస్ట్ ఆఫీస్, బ్యాంకును విద్యార్థులు సందర్శించి నేరుగా సంస్థల అధికారులతో విధులు, వారి సేవలపై అడిగి నేరుగా తెలుసుకున్నారు. సంబంధిత శాఖ అధికారులు విద్యార్థులకు పలు విధులు సేవలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. అనంతరం ఆధార్ కేంద్రంను సందర్శించి బరీష్ కెమెరా గురించి, ఐరీష్ గురుంచి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు శ్యామల, అంగన్‌వాడి టీచర్ల లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



ఫెర్టిలైజర్ షాపుల్లో తనిఖీ చేస్తున్న డీఏవో

హాజీపూర్, జూన్27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫెర్టిలైజర్‌షాపుల్లో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, పురుగులమందులు, విత్తనాలు ఫెర్టిలైజర్‌షాపుల్లో కొనే ప్రతి రైతు ఖచ్చితంగా రశీదు తీసుకోవాలని తెలిపారు. ఫెర్టిలైజర్ డీలర్లు ఎరువులను ఈపోఓఎస్ మిషన్‌ద్వారా రైతు ఆధార్‌కార్డుతో అనుసంధానం చేయాలని అన్నారు. పంట విస్తీర్ణం ప్రకారం ఎరువులు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. నానో యూరియా, లిక్విడ్ ఫెర్టిలైజర్ వాడకంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఫెర్టిలైజర్ యజమానులపై ఉందని అన్నారు. డీఏవో వెంట మండల వ్యవసాధికారి క్రిష్ణ ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రికసమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చార్వాక హాలులో సమ్మె కరపత్రాలను విడుదల చేసి మాట్లా డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికవ్యతిరేక విధానాలను అవలం భిస్తుందని, దీన్ని తిప్పికొట్టేందుకు కార్మికులందరు సిద్దంగా ఉండాలన్నారు. దేశాన్ని కార్పోరేట్‌శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్రలు చేస్తుంద న్నారు. దేశ వ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, రమేష్, ఉమారాణి, సమ్మక్క పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధిలో సంఘాల పాత్ర కీలకం

మందమర్రిటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికులతో పాటు కార్మిక సంఘాల పాత్ర కీలకమైందని సింగరేణి డైరెక్టర్ పా గౌతం పొట్రు అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని ఎల్లందు క్లబ్‌లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో నిర్వహించిన 51స్ట్రక్చర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థకు నిర్ధేశించిన ఉత్పత్తి సాధనలో కార్మికులు, సంఘాలు కీలకపాత్ర పోషించాలన్నారు. కార్మికులసంక్షేమానికి యాజమా న్యం పెద్దపీట వేస్తుందన్నారు. గత స్ట్రక్చర్ సమావేశంలో విన్న వించిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో యాక్టింగ్‌క్లర్కులను క్రమబద్ధీకరణ చేయాలని, సెక్యూరిటీ గార్డుల ఖాళీలను అంతర్గంగా భర్తీ చేయాలని, రాష్ట్ర లేబర్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో డ్రిల్‌ఆపరేటర్ల క్యాడర్‌స్కీం కేసునువెంటనే పరిష్కరించాలని నాయకులు కోరారు. కారుణ్యనియామకాల కింద అర్హులైన విద్యార్హతలు ఉన్న వారికి తగిన పోస్టులను కేటాయిం చాలన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య, ప్రధా న కార్యదర్శి రాజ్‌కుమార్, రంగయ్య, వెంకటి, అక్బరలీ, సారయ్య, రావు, వీరభద్రం, సమ్మయ్య, రాంగోపాల్, జీఎం పర్సనల్ కవిత నాయుడు, మనోహర్, సుబ్బారావు, రఘురాంరెడ్డి, కిరణ్‌కుమార్, రవి, వెంకటేశ్వర్లు, రవికుమార్, రాజేంద్ర ప్రసాద్, వెంకయ్య, అజయ్‌కుమార్, ప్రసాద్, రాజగోపాల్, నారాయణరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం



నీల్వాయిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి

వేమనపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నీల్వాయి గ్రామంలో ఇంటర్ ఒకేషనల్ కోర్సు ఎంఎల్‌టీ తరగతులను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే కస్తూర్బా విద్యాలయంలో రూ. 66 లక్షలతో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం వేమనపల్లిలో నిర్వహించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థినీల కోసం ప్రభుత్వం అనేక వసతులు కల్పిస్తుందని, శ్రద్ధగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మండలానికి జూనియర్ కాలేజీ, ఒకేషనల్ ఎంఎల్‌టీ కాలేజీ తీసుకువచ్చి మాట నిలబెట్టుకున్నానన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ, విద్యుత్ జిల్లా అధికారి గంగారాం, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో కుమారస్వామి, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేష్, లింగాగౌడ్, నాయకులు రాజన్న, గాలి మధు, తోకల రాంచందర్, సత్యనారాయణ, జహీద్ అలీ, పురుషోత్తం, మధుసూదన్, పున్నం, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైళ్ల ఆలస్యం.. ప్రయాణికుల అవస్థలు

బెల్లంపల్లి,జూన్27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైల్వే స్టేషన్‌లకు రావాల్సిన పలు రైళ్లు శుక్రవారం గంటలకొద్ది ఆలస్యంగా నడిచాయి. ముందస్తు సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రతి రైలు దాదాపు రెండునుంచి మూడు గంటలపాటు ఆలస్యంగా నడిచాయి. పెద్దపల్లి జిల్లా కూనారం ఆర్‌వోబి వద్ద క్లస్టర్ విరిగిపోవడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని రైల్వే అధికారులు తెలిపారు. సిర్పూర్‌కాగజ్‌నగర్ టు సికింద్రాబాద్ మధ్య నిడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, తెలంగాణ ఎక్స్‌ప్రెస్, ఇంటర్ సిటీఎక్స్‌ప్రెస్ పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు సైతం గంటలతరబడి ఆలస్యంగా నడిచాయి. దీంతో హైదరాబాద్ విజయవాడ, వరంగల్‌తో పాటు బల్లార్షానాగ్‌పూర్, న్యూఢిల్లీకి వెళ్లే ఎంతో మంది ప్రయాణికులు జిల్లాలోని బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల రైల్వే స్టేషన్‌లలో గంటలతరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు



బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో రైలు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

చేసేదేమిలేక ప్రైవేటు వాహనాలను, బస్సులను ఆశ్రయించి తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.

హక్కు పత్రాలు ఇచ్చే వరకు పోరాటం ఆగదు

పోడు వ్యవసాయం కోసం ఫారెస్ట్‌లో చెట్లు నరికివేత

దండేపల్లి జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అడవి ప్రాంతాన్ని నమ్ముకుని జీవిస్తున్న తమకు పోడు వ్యవసాయానికి సంబంధించిన భూ హక్కు పత్రాలు ఇచ్చేంత వరకు భూ పోరాటం ఆగదని ఆదివాసి గిరిజనులు అన్నారు. మండంలోని కొత్త మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని దమ్మనపేట, మామిడిగూడ గ్రామాలకు చెందిన ఆదివాసి గిరిజనులు, లింగాపూర్ అటవీ బీట్ లోని 380 కంపార్టమెంట్‌లో శుక్రవారం పలు చోట్ల పోడువ్యవసాయం కోసం చెట్లు నరికివే శారు. అనంతరం అక్కడే విత్తనాలు విత్తారు. ఈవిషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకుని వారికి ఎంత నచ్చజెప్పినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో అటవీశాఖ అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, దండేపల్లి ఎస్సై తాహ సీనోద్దీన్ సిబ్బందితో అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. ఇటీవల అటవీ గ్రామ సమీపంలో ఉండే కొందరు గిరిజనులు అటవీచట్టాలపై పోలీసులు అవగా హన కల్పించారు. అయినా మళ్లీ గిరిజనులు మళ్లీ ఇలా చెట్లు నరికి వేయడం సరికాదన్నారు. అటవీ భూముల్లో చెట్లను తొలగించడం, నరికి వేడయం చట్ట విరుద్ధమని గిరిజనులకు సూచించారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో చెట్లను నరికి వేదయం చట్టపరంగా నేరం అవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంగాని, అధికారులు స్పందించి తమకు న్యాయం చేసి పట్టాలు ఇవ్వాలని ఆదివాసి గిరిజనులు వేడుకుంటున్నారు.



లింగాపూర్ అటవీ బీట్‌లో చెట్ల పొదలు తొలగించి విత్తనాలు వితుతున్న గిరిజన మహిళలు

పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న కాసిపేట కౌన్సిల్ సభ్యులు

కాసిపేట, జూన్27 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలను పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలమైన నిర్మాణం దిశగా తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో మావోయిస్టులపై జరుగుతున్న మారణహోమాన్ని నిలిపివేసి వారితో శాంతిచర్చలు జరిపి మానవ హక్కులను కాపాడాలని కోరారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడుభూములకు పట్టాలివ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన కొత్త రేషన్‌కార్డులను అర్హులందరికీ అందజేయాలన్నారు. సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం కింద రెండు గుంటల భూమి ఇచ్చి ఇంటి నిర్మాణానికి అడ్డులేకుం డా 20లక్షల రుణసాయం అందజేయాలని కోరారు. జిల్లా కార్యదర్శిగా ఎన్నికై మొదటిసారి మండలానికి వచ్చిన నేపథ్యంలో రామడుగు లక్ష్మణ్‌ను మండల కౌన్సిల్ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసమా వేశంలో సీపీఐ మండల కార్యదర్శి దాగాం మల్లేశ్, జిల్లా నాయకులు జాడి పోచం, దాడి గట్టయ్య, గట్టు సర్వేసనం, దుర్గం సుధాకర్, పులిశంకర్, రాజలింగు, బండారి సత్తయ్య, గంగాధర్ రాజన్న, గోలేటి రాజుకుమార్, రాంటెంకి విజయ, మధునయ్య, రాజేశ్, శంకర్‌లు పాల్గొన్నారు.

లారీ, ఆటో ఢీకొని ఒకరి మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

జైపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం ఫారెస్టు చెక్‌పోస్టు సమీపంలోని రాజీవ్ రహదారిపై లారీ ఆటో ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ పొడాల రాజేష్(30) మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు జైపూర్ ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల పట్టణంలోని సాయిరాంనగర్‌కుచెందిన పొడాల రాజేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని రాళ్లపేటకు చెందిన సయ్యద్ అజీమ్, బెల్లంపల్లి ఏరియాకు చెందిన ఆయిళ్ల రమ అనే ప్యాసింజర్లను తీసుకుని గోదావరిఖనికి వెళ్తున్నాడు. ఇందారం చెక్‌పోస్టు సమీపంలోకి రాగానే గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ లారీని అతి వేగంగా నడుపుతూ సడన్‌గా బ్రేక్ వేయడంతో ఆటో డ్రైవర్ రాజేష్ ఆటో అదుపు తప్పి లారీని వెనక నుంచి ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేష్‌కు తల, ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తీవ్ర గాయాలైన ఇద్దరిని గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం

మహిళ ఆత్మహత్యాయత్నం

మందమర్రిరూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తనకు డబుల్‌బెడ్‌రూం ఇల్లు కేటాయించాలని కోరుతూ శుక్రవారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రామకృష్ణాపూర్‌లోని కనకదుర్గ కాలనీకి చెందిన పూరెళ్లి లక్ష్మీ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు దరఖాస్తు అందజేసింది. అనంతరం బయటకు వచ్చిన సదరు మహిళ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. వెంటనే అక్కడున్న వారు గమనించి అడ్డుకున్నారు. బాధితురాలు మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల మొదటి లిస్టులో తన పేరు మీద ఉందని, ఫైనల్ లిస్టులో పేరును తొలగించారిని పేర్కొంది. తాను కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నానని, తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, సొంతిల్లు లేక ఇబ్బందులు పడుతున్నానని ఫిర్యాదులో పేర్కొంది. కాగా మహిళ ఆత్మహత్యాయత్నం విషయం తహసీల్దార్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి అక్కడ నుంచి ఆమెను పంపించివేశారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన

మంచిర్యాలక్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం గురుకుల కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డిగ్రీ విద్యార్థిని స్వప్న గురువారం రాత్రి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని స్వగ్రామమైన మొర్తాడ్ గ్రామానికి పోలీసు బందోబస్తుతో తరలించారు. ఆమెకు న్యాయం చేయాలంటూ స్వగ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కుటుంబ సభ్యులు కళాశాల భవనం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా బెజ్జూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు శ్యాం నాయక్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్లనే స్వప్న మృతి చెందిందని అన్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి దర్యాప్తు చేసి స్వప్న కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. నాలుగు నెలల క్రితం ఇదే కళాశాల భవనంపై నుంచి ఆత్మహత్యకు పాల్పడినప్పటికీ ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోలేదని విమర్శించారు. స్వప్న చదువులో ముందుండేదని కుటుంబంలో ఎలాంటి కలహాలు లేవని ముమ్మాటికీ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది వల్లనే మృతి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో గురుకులంలో ఇప్పటి వరకు సుమారు 60 మంది మృతి చెందారని ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతు న్నాయని విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దశల వారీగా ఎరువులు అందజేస్తాం

సిర్పూర్(టి), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు అవసరమైన ఎరువులు దశల వారీగా అందజేస్తామని ఏవో గిరీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 15 వేల ఎకరాల్లో పత్తి, ఐదు వేల ఎకరాల్లో వరి పంటలను సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీరికి సహకార సంఘం ద్వారా 800 టన్నుల యూరియా, 400 టన్నుల డీఏపీ ఎరువుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కల్వర్టుల వద్ద జర జాగ్రత్త



జైనూర్ మండలం లెండిగూడ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

- గుంతల రోడ్లపై రాకపోకలకు అవస్థలు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

జైనూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తుంటాయి. కానీ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో పలు రోడ్లు నరకానికి నకళ్లుగా మారుతు న్నాయి. మారుమూల ప్రాంతాల వాసులు ఏదైనా అత్యవసర పనుల కోసం మండల, జిల్లా కేంద్రాలకు రావాలంటే గతుకులమయమైన, కంకర తేలిన, దారుల్లో అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రాల నుంచి గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేసే రోడ్లు అధ్వానంగా మారాయి. ఆయా రోడ్లపై ఎప్పుడో నిర్మించిన కల్వర్టులు పూర్తి స్థాయిలో దెబ్బతినడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అవి రోడ్లకు సమాంతరంగా ఉండడంతో రాత్రి సమయాల్లో సరిగ్గా కనబడక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

పవర్‌గూడ నుంచి జైనూర్ వరకు..

జైనూర్ మండలంలోని పవర్‌గూడ నుంచి జైనూర్ టింకాపెల్లి వరకు సుమారు 13 కిలోమీటర్ల దూరంలో సుమారు 14 చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి ఉండడంతో తరుచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల పవర్‌గూడ సమీపంలో ఏర్పడిన గుంతలో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి పడి పోయిన ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాలు జరుగుతున్నా గుంతలు పూడ్చేందుకు అధికారులు చర్యల తీసుకోక పోవడంపై వాహనదారులు మండిపడుతున్నారు. గుంతల కారణంగా రోడ్డు కనబడక పోవడం మూలంగా వాహనాలు చెడి పోవడంతో పాటు గాయాల పాలవుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. వాహనాలతో ఇతర ప్రాంతా లకు వెళ్లాలన్నా తమకు రక్షణ లేకుండా పోయిందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇటీవల ఆటో తెల్లవారు జామున ఆశ్రమ పాఠశాలలో వంట చేసే సిబ్బందిని తీసుకెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి గుంతలో వాహనం అదుపుతప్పి పడిపోయింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ తీవ్ర గాయాలపాలై చికిత్స పొందు తున్నట్లు సమాచారం. ఆటో సైతం పూర్తిగా దెబ్బతి న్నదని యజమాని వాపోతున్నాడు. ఇక్కడ తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు సత్వరమే రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి కల్వర్టుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని లేండిగూడ సమీపంలో ఉన్న కల్వర్టు రోడ్డుకు సమాంతరంగా ఉండటంతో వాహనదారులు రాత్రి సయయాల్లో వాహనాలు నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని జామ్ని కల్వర్టు సైతం రోడ్డుకు ఎత్తుగా లేక పోవడం, సమాంతరంగా ఉండడం కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా కల్వర్టుల వద్ద ప్రమాద సూచకలు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లపై గుంతలు పూడ్చి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

తరుచుగా ప్రమాదాలు..

డోంగ్రే సమాధాన్, మానవ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా చైర్మన్



జైనూరు మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లపై కల్వర్టుల వద్ద గుంతల పడి తరుచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో అయితే ద్విచక్ర వాహనదారులు మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

ఎరువుల దుకాణాల తనిఖీ

కాగజ్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయాధికారి రామకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు ఎరువులు ప్రభుత్వం సూచించిన ధరకే విక్రయించాలని చెప్పారు. రైతులు నానో ఎరువులు వాడితే మొక్కలను పోషకాలు అందుతాయని అన్నారు. భూ సారం కూడా దెబ్బ తినకుండా పంట దిగుబడి వస్తుందని చెప్పారు. పర్యవరణానికి మేలు చేస్తాయని, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తాయని తెలిపారు.

రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలి

జైనూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సంత్ రామారావు మహారాజ్ పేరట గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని లంబాడా ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ జాదవ్ గణపత్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నార్నూరు మండలంలోని దీక్షా భూమి వద్ద అభివృద్ధి పనులకు రూ. 10 కోట్లు మంజూరు చేయాలన్నారు.. లంబాడాల ఆత్మ బంధువు సంత్ సేవాలాల్ మహారాజ్ అడుగు జాడలో రామారావ్ మహారాజ్ సభ్య సమాజాన్ని చైతన్యవంతులు చేస్తు, ఆధ్యాత్మిక మార్గంలో అందరిని తీసుకెళ్తున్నారని అన్నారు. అధికారులు పాఠశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా నాయకులు రాథోడ్ రాందాస్, రాథోడ్ ధర్మేందర్, పీతా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు ఎత్తివేయాలి

- ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మహిళలు ధర్నా

కాగజ్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం చింతగూడలో బెల్టు షాపులను ఎత్తివేయాలని కోరుతూ శుక్రవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మహిళలు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ గ్రామంలో బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నా రని అన్నారు. అధికారులకు తెలిపినా కూడా ఏ మాత్రం పట్టించుకోవటం లేదని వాపోయారు. అధికారులు పట్టించుకొని చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భీంరావు, నాగేందర్ మహిళలు పాల్గొన్నారు.



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న మహిళలు



రాస్తారోకో చేస్తున్న మహిళలు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కాగజ్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భట్టుపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు ప్రధాన రహదారిపై శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తమ గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. సమస్యలను అధికారులు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తమ సమస్యను పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలిపారు. అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు రాస్తారోకో విరమించారు.

అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టివేత

వాంకిడి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న దేశీదారు మద్యాన్ని శుక్రవారం వాంకిడి పోలీసులు పట్టుకున్నారు. వాంకిడి ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం... వాంకిడి బస్టాండ్ వద్ద ఏఎస్సై పోశెట్టి పోలీసులతో కలిసి వాహనాల తనిఖీలు చేస్తుండగా మహారాష్ట్ర వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులో తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 250 (90 ఎంఎల్) దేశీదారు బాటిళ్ల లభించాయన్నారు. వీటి విలువ రూ.12,500 ఉంటుందని తెలిపారు. గడ్చిరోలి జిల్లా సిరివంచకు చెందిన కృష్ణమూర్తిగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా మద్యం, దేశీదారు తర లిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న దేశీదారు

ఇందిరమ్మ గృహాలకు భూమి పూజ

సిర్పూర్(టి), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పనులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య మాట్లాడుతూ లబ్ధిదారులు గృహాలు సకాలంలో నిర్మించుకోవాని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ సమీర్ అహ్మద్, నాయకులు తిరుపతి, ఏఈ సైఫోద్దీన్, కమిటీ సభ్యులు గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఎస్సీ, ఎస్టీ కమిటీ

జైపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీలో సింగరేణి కాలరీస్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్సీజనరల్ సెక్రటరీ నాగేశ్వర్‌రావు, ఎస్టీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పంతుల తెలిపారు. ఎస్టీపీపీ ఎస్సీ లైజన్ అధికారిగా వెంకటయ్య, చీఫ్ అడ్వైజర్‌గా జనగామ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా పులి సురేష్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులును కలిసి ఎన్నికల బ్రాంచ్ కమిటీ సభ్యుల లెటర్ ప్యాడ్‌ను అందజేసినట్లు తెలిపారు. ఎస్టీపీపీ మెయిన్ గేటు ముందు సింగరేణి స్థలంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఈడీ, జీఎంలను కోరారు.. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, సురేష్, సదాశివ, రాయ మల్లు, అజయ్, శ్రీనివాస్, నర్సయ్య, సౌజన్య, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సదానందం పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం



డైరెక్టర్(పా)కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో ఉద్యోగుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు అన్నారు. కొత్తగూడెంలోని ఇల్లందు క్లబ్‌లో గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన 51వ నిర్మాణాత్మక సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకతలో కార్మిక సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్మికుల కు చెందిన పలు డిమాండ్లను సమావే శం ముందుంచారు. యాక్టింగ్ క్లర్కుల ను క్రమబద్ధీకరించాలని, సెక్యూరిటీ గార్డుల ఖాళీలను అంతర్గత ఉద్యోగులతో భర్తీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌ఓసీలను వెంటనే క్లియర్ చేయాలని, ఉద్యోగులు తక్కువ గ్రేడ్ నుంచి ఎక్కువ గ్రేడ్‌కు మారినప్పుడు వారికి పదోన్నతులు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, డ్రిల్ ఆపరేటర్ల కేడర్ స్కీమ్ కేసు పరిష్కరిం చాలని చెప్పారు. బొగ్గు ఉత్పత్తి పర్మనెంట్ ఉద్యోగులు మాత్రమే చేయాలని, గని ప్రమాదంలో మరణించిన ఉద్యోగుల వారసులకు విద్యార్హతను బట్టి పోస్టులు కేటాయించాలని, కుమారుడు, కుమార్తెతో సమానంగా అల్లుడికి కూడా ఏడాదిలోపు దరఖాస్తు చేసుకున్న కేసుల ను పరిష్కరించాలని కోరారు. ఆయా విషయాలను పరిశీలించి సరైన నిర్ణయం తీసుకుంటామని డైరెక్టర్(పా) వారికి హామీ ఇచ్చారు. గైర్హాజరీ ఉద్యోగులు, వారి కుటుం బ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి విధులకు హాజర య్యేందుకు యూనియన్ నాయకులు సహకారం అందిం చాలని ఆయన కోరారు. సమావేశంలో జీఎం(పర్సనల్, ఐఆర్ అండ్ పీఎం) కవితా నాయుడు, జీఎం(సీపీపీ) మనోహర్, జీఎం(ఫైనాన్స్) సుబ్బారావు, జీఎం(యూజీ మైన్స్) రఘురామిరెడ్డి, జీఎం(పర్సనల్, వెల్ఫేర్, సీఎస్ఆర్) కిరణ్ కుమార్, ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, కేంద్ర ఉపాధ్యక్షులు వంగ వెంకట్, ఎండీ అక్బర్ అలీ, ఉప ప్రధాన కార్యదర్శులు సారయ్య, వైవీ రావు, వీరభద్రయ్య, సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్, అన్ని విభాగాలకు చెందిన హెచ్ఓడీలు పాల్గొన్నారు.



కార్మికుల డిమాండ్ల సాధనే ధ్యేయం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకుడు సమ్మయ్య

రెబ్బెన, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల డిమాండ్ల సాధనే ఐఎన్‌టీయూసీ ధ్యేయం సెంట్రల్ సీనియర్ ఉపాధ్యక్షుడు సమ్మయ్య అన్నారు. ఖైరిగూడ ఓసీపీ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ద్వారా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లినప్పుడు అప్పటి సెక్రటరి జనక్ ప్రసాద్ యాజమాన్యంతో మాట్లాడి ప్రభుత్వం నుంచి రూ.400 కోట్లు ఇప్పించారని అన్నారు. కార్మికుడి సొంత ఇంటి పథకం తప్పకుండా అమలు చేసేలా చూస్తామన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంశెట్టి నరేందర్ మాట్లాడుతూ సింగరేణిలోని ఆపరేటర్ల ప్రమోషన్‌ల సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కాంట్రా క్టు కార్మికుల సమస్యలను కూడా పరిష్కరించేందుకు రాష్ట్ర సంఘం నాయకులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. సమావేశంలో నాయకులు ప్రకాష్ రావు, రామారావు, వీరస్వామి, భాస్కరాచారి, మాధవ కృష్ణ, నారాయణ, బూర శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీని పరిశీలించి.. సూచనలు చేసి..



ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కె వెంకటేశ్వర్లు శుక్రవారం సందర్శించి అధికారులకు పలు సూచనలు చేవారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత 35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించేందుకు సరైన ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని సూచించారు. సీనియర్ల నుంచి తగిన సలహా లు, సూచనలు స్వీక రించాలన్నారు. అనంతరం క్వారీలో నికి వెళ్లి కోల్‌బెంచ్‌లు, ఆఫ్ లోడింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఓబీ కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని క్వారీలో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని సింగరేణి డైరెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, శ్రీరాంపూర్, ఇందారం ఓసీ పీల పీవోలు వెంకటేశ్వర్లు, ఏవీరెడ్డి, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, గని రక్షణాధికారి శ్రీధర్, సర్వే అధికారి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

జైపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే ఓసీపీలో శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా బలరామ జలధి వద్ద మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఓసీపీ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, మేనేజర్‌లు నాగయ్య, శంకర్, ప్రాజెక్టు ఇంజనీర్ రామకృష్ణరావు, సేఫ్టీ అధికారి మహేష్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గనిలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గనిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కార్మికులు కోరారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఆర్‌పీ 1 గనిని సందర్శించారు. అన్ని విభాగాలను పరిశీలించి, కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. . కార్యక్రమంలో పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, సహాయ కార్యదర్శి పరశురాం, నాయకులు అనంతరెడ్డి, బైరి శ్రీనివాస్, దహిత ప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

9న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన నిర్వహించే సమ్మెను సింగరేణి కార్మికులు విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. రాయమల్లు, కార్యదర్శి ఎం. పోచమల్లు కోరారు. శ్రీరాంపూర్‌లో ఏఐఎఫ్‌టీయూ ముఖ్యుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. కేంద్రం అవలంబిస్తున్న విధానాలకు నిరస నగా సమ్మె చేపడుతున్నామని చెప్పారు. సమ్మె కేంద్రం ప్రభుత్వం కార్మికులకు ఇబ్బంది కలిగేలా తీసుకొచ్చే చట్టాలను వెంటనే ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు సమ్మెలో పాల్గొనాలని కోరారు. స మావేశంలో నాయకులు అంజయ్య, రత్నకుమార్, రాములు, రాజ్‌కుమార్, రామస్వామి, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన అధికారికి సన్మానం

జైపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలోని జైపూర్‌లోని ఎస్టీపీపీలో కార్పొరేట్ జనరల్ మేనేజర్(సోలార్)గా విధులు నిర్వహిస్తున్న జానకిరామ్ పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా శుక్రవారం ఎస్టీపీపీలో అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి , జీఎం శ్రీనివాసులు జనకిరామ్ సంస్థకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు నర్సింహారావు, జేఎస్ సింగ్, సముద్రాల శ్రీనివాస్, మురళీధర్, మదన్ మోహన్, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు..

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదనలు పంపి తెప్పించి రైతులకు అందిస్తోంది. ఇప్పటికే చాలా మంది రైతులు విత్తనాలను కొనుగోలు చేసి తీసుకెళ్లారు. పంటల సాగు మొదలు కావడంతో వ్యవసాయ రంగంలో రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైయ్యారు. ఇంకా పత్తి 3,95,507 ప్యాకెట్లు, వరి 5837 క్వింటాళ్లు, కంది 48 క్వింటాళ్లు, మొక్క జొన్న 5.2 క్వింటాళ్ల షాపుల్లో అందుబాటులో ఉన్నాయి.

● అందుబాటులో ఎరువులు...

వానా కాలం ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వానికి ప్రతి పాదించిన ఎరువులు ఇప్పటి కొంత వరకు జిల్లా చేరగా ఇంకా దశల వారీగా రానున్నాయి. ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్ ఎరువులు డీలర్లు, సొసైటీలు, మార్క్‌ఫెడ్‌ల వద్ద ఎరువుల నిల్వలున్నాయి. ప్రస్తుతం యూరియా- 4433.63 మెట్రిక్ టన్నులు, డీఏపీ-1673.68 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్ ఎరువులు-10105.45 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ-1234.55 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ-610.19 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి



భీమిని సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ పీఎం రవీందర్

భీమిని, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయాలని నూతన గ్రామ సమాఖ్య పాలక వర్గ సభ్యులకు సెర్ప్ పీఎం రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భారత మాత మండల సమాఖ్య పదాది కారుల శిక్షణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రతీ ఒక మహిళ సంఘాల్లో చేరేలా కృషి చేసి ఆర్థిక స్వయం సాధికారత సాధించే దశగా మహిళా సంఘాలను వినియోగించుకోవాలన్నారు. ప్రతీ మహిళ పేదరికంలోంచి బయటకు వచ్చి సాధికారత దిశగా పయనించాలని సూచించారు. ఈ దశగా గ్రామ సమాఖ్య పాలకవర్గ బాధ్యులు కృషి చేయాలన్నారు. ఐకేపీ ద్వారా అందించే శిక్షణ కార్యక్రమాల ద్వారా వ్యక్తులు తమ నైపుణ్యాలను మెరుగు పరచుకోవ డంతో ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడం, సహజ అభివృద్ధికి దోహద పడతామన్నారు. వీటితో పాటు ఆర్థిక నిర్వహణ, ఇతర నైపుణ్యాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కారెం కళావతి, డీఆర్‌డీఓ హెడ్ ఆఫీస్ ఏపీ ఎం ప్రవీణ్, ఏపీఎం వసంత్, సీసీ శోభ, లక్ష్మణ్, ఎంఎస్‌ఏ గంగారాం, సీవో ప్రశాంత్, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

బీసీ చైతన్య సదస్సును విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈ నెల 29న జరగనున్న బీసీ చైతన్య సదస్సును విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్‌లు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని సాధించుకునే దిశలో తెలంగాణ బీసీలు ఉద్యమిస్తున్నారని తెలిపారు. బీసీలను చైతన్యపరిచందుకు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సులో బీసీలందరు పాల్గొని వియవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేముల అశోక్, రంగు రాజేశం, ప్రకాష్, మహ్మద్ పాషా, జైపాల్‌సింగ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

'కేసీఆర్ ఫొటో స్టేటస్ పెట్టడమే నేరమా'

భీమారం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్ ఫోటో తాను స్టేటస్‌గా పెట్టుకోవడమే నేరమా అంటూ మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన నక్క వేణు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బీఆర్ఎస్ అంటే వేణుకు అభిమానం. రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫొటో వాట్సాప్ స్టేటస్ పెట్టుకోవడంతో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు ఉన్నా కానీ అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రొసీడింగ్ పత్రాలు ఇవ్వకుండా ఇందిరమ్మ ఇల్లును రద్దు చేయాలనే దురుద్దేశ్యంతో ఇవ్వలేదు. ఇదే గ్రామానికి చెందిన ఇందిరమ్మ జాబితాలో పేర్లు ఉన్న వారికి గ్రామంలో లేకున్నా వరంగల్, హైద్రాబాద్ లాంటి దూర ప్రాంతాల్లో ఉన్నా వారిని పిలిపించి పత్రాలు ఇచ్చారు. తాను అత్యంత నిరుపేదనని తనకు ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ పత్రం ఇవ్వక పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తనకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరాడు.

కాసిపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ



కాసిపేట పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

కాసిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని కాసిపేట పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది వివరాలను, స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిస్థితులు, ఎలాంటి నేరాలు జరుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యుత్ ప్రమాదాలపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

హాజీపూర్,జూన్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రైతులకు విద్యుత్ ప్రమాదాలపై పలు సూచనలు చేశారు. తడి ఉన్న సమయంలో మోటార్ స్టార్టర్లను కర్రలతో ఆన్ చేయాలని, విధిగా చెప్పులు వేసుకొని కరెంటు పనులు చేసుకోవాలని తెలిపారు. విద్యుత్‌వైరు తెగి పడి ఉంటే వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేయాలని సంబంధిత సబ్‌స్టేషన్ జేఎల్ఎం, కెఎల్ఎం, లైన్‌మెన్‌ల ఫోన్‌నంబర్లను ఇచ్చారు. ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి అత్యంత జాగ్రత్తగా ఉండాలని, చిన్నపిల్లల పట్ల అజాగ్రత్త పనికారాదన్నారు. ఈకార్యక్రమంలో డిఈ మహ్మద్‌కైజర్, ఏఈ మహేందర్ రెడ్డి, ఎఎల్ఎం శేఖర్, రవి, రైతులు పాల్గొన్నారు.

సరదా..కారాదు విషాదం



క్వారీలో కొలను

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

క్వారీలో ప్రమాదాల నివారణకు కొలనుకు కంచె నిర్మించాలి

మంచిర్యాలక్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా క్వారీలో ఏసీసీ సిమెంట్ కంపెనీ నిర్వహణ సమయంలో సంస్థ ఆధ్వర్యంలో పార్కును ఎంతో సుందరంగా ఏర్పాటు చేశారు. దీంతో మంచిర్యాల పరిసర ప్రాంత ప్రజలు పార్కును చూసేందుకు తరలి వెళ్లేవారు. జిల్లాలోనే కాకుండా పొరుగు జిల్లాలో సైతం ఈ అటవీ ప్రాంతానికి విద్యార్థులు సైతం పిక్‌నిక్ వచ్చే వారు. ఏసీసీ కంపెనీని కొందరు మంచిర్యాలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. అనంతరం అది ఎంసీసీ కంపెనీగా మారింది. ఏసీసీ కంపెనీ ఆధ్వర్యంలో పార్కును అభివృద్ధి చేసేందుకు ఇద్దరు వాచ్‌మెన్‌లతో పాటు గార్డెన్‌లు కూడా నియమించారు.

పదేళ్ల క్రితం మంచిర్యాలకు చెందిన వారు కొనుగోలు చేసినప్పటి నుంచి పార్కును పట్టించుకోకపోవడంతో అది అధ్వానంగా మారింది. పార్కుకు ఇరువైపు గేట్‌లను మూసివేశారు. అయినప్పటికీ ప్రతి సంవత్సరం ఆషాఢమాసంలో ఏసీసీ కంపెనీ ఏర్పాటు చేసిన దుర్గామాత జాతరకు వేలాదిగా తరలి వెళ్తుంటారు. ఆషాఢమాసంలోనే కాకుండా సాధారణ సమయంలో

కొలను వద్దకు వెళ్లవద్దు... సీఐ ప్రమోద్‌రావు



క్వారీకొలను ప్రమాదకరంగా ఉంటుంది. లోతుగా ఉంటుంది. కొలను వైపు ఎవరు వెళ్లవద్దు. పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారు. క్వారీ జాతర సమయంలో పటిష్టమైన బందోబస్తు చేస్తున్నాం. పిల్లలపై తల్లిదండ్రులు కూడా గమనిస్తూ ఉండాలి. ఎటు వెళ్తున్నారు ఎవరితో వెళ్తున్నారు అనే విషయాలను తెలుసుకుని అప్రమత్తంగా వ్యవహరించాలి.

పిల్లలను గమనించాలి..

పిల్లలు క్వారీకి వెళ్లి సరదా కోసం ఫొటోలు దిగుతూ ఉంటారు. పిల్లలతో పాటు పలువురు కుటుంబంతో దుర్గామాతకు వెళ్లి దర్శనం అనంతరరం ఫొటోలు దిగుతుంటారు. కొలను ఎంతో చూడ ముచ్చటగా ఉండడంతో ఫొటోలు దిగేందుకు లేదా ఈతకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటారు. పెద్దలు వారిని గమనించి అటువైపు వెళ్లకుండా చూసి నట్లయితే ప్రమాదం జరుగకుండా ఉంటుంది. సరదా కోసం కానరాని లోకాలకు వెళ్తే ఆ కడుపు కోత ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. క్వారీ జాతర సమయంలో పటిష్టమైన పోలీసు భద్రత ఉంటుంది. కొలను వైపు వెళ్లకుండా పోలీసులు కాపుకాసి అటు వెళ్లకుండా చర్యలు తీసుకుంటారు.

సాధారణ సమయంలో ముఖ్యంగా ఆదివారం బ్లూకోట్ సిబ్బంది అప్పుడప్పుడు పెట్రోలింగ్ చేస్తూ గమనిస్తూ ఉంటారు. అయితే ఇలాంటి ప్రమా దాలు జరుగకుండా ఉండాలంటే కొలనులోకి వెళ్ల కుండా శాశ్వతంగా ఒక కంచెను నిర్మించినట్లయితే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉంటాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏసీసీ కొలను పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉన్నందున సంబంధిత అటవీశాఖ అధికారులు స్పందించి కొలను చుట్టు కంచెను వేయాలని పలువురు కోరుతున్నారు.

యువకులు సరదా కోసం స్నేహితులతో క్వారీకి వెళ్లి సరదాగా గడుపుతుంటారు. అయితే అక్కడ ఎలాంటి పోలీసు రక్షణ లేదు. ఏసీసీ సమయంలో రాయి కోసం తీసిన ప్లేస్‌లో పెద్ద కొలను ఏర్పడింది.

అది ఎంతో అందంగా చూపరులను ఆకర్షించే విధంగా ఉండడంతో పలువురు అక్కడికి వెళ్లి ఫొటోలు దిగి వస్తుంటారు. ఈ క్రమంలో కొందరు యువకులు స్నానం చేసేందుకు దిగి ఈతరా కపోవడంతో గతంలో ఒక ముగ్గురు చనిపోయినట్లు సమాచారం. ఈ నెల 3న మంచిర్యాలకు చెందిన సాదుల హర్షవర్ధన్ తన స్నేహితులతో సరదాగా వెళ్లి భోజనం చేసిన అనంతరం ఈత గొట్టేందుకు ఇద్దరు కొలనులోకి వెళ్లగా హర్షవర్ధన్ ఈత రాకపోవడంతో మునిగి మృతి చెందాడు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

తాండూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలోని పార్ట్‌టైం స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం హైద్రాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్‌కు పార్ట్‌టైం స్వీపర్స్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందించారు. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాబోయే నోటిఫికేషన్‌లో అర్హత కలిగిన వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా గ్రంథాలయ శాఖ స్వీపర్స్ అసోసియేషన్ నాయకులు స్వామి, మధుకర్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురికి రిమాండ్

నెన్నెల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జోగాపూర్ గ్రామానికి చెందిన సప్ప అనీల్, సునీల్, కుమార్‌లను దాడి కేసులో శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఈ నెల 3న అదే గ్రామానికి చెందిన సప్ప భీమయ్య బెల్లంపల్లి నుంచి బైక్‌పై వస్తుండగా దారి కాచి కర్రలతో దాడి చేసి గాయపరిచారని చెప్పారు. దాడిలో భీమయ్య చేయి విరిగిందని, కాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. బాధితుడి మెడికల్ సర్టిఫికెట్ల ఆధారంగా కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్సై వివరించారు.

బదిలీపై వెళ్లిన అధికారికి సన్మానం

మందమర్రిటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఏరియాలోని జీఎం కార్యాలయంలో జూనియర్ సర్వే ఆఫీసర్‌గా ఏరియా అభివృద్ధికి సంపత్ చేసిన సేవలు అభినందనీయమని ఏరియా సర్వే ఆఫీసర్ భుక్య దేశాయ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సర్వే కార్యాలయంలో బదిలీ అయిన సంపత్‌కు ఆత్మీయ సన్మానం చేశారు. సర్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను సక్రమంగా నిర్వహించాలి



ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

కన్నెపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలాల్లో ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వహించాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. కన్నెపల్లిలో శుక్రవారం ఉపాధి హామీ తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. 2024-25 సంవత్సరంలో రూ. 4కోట్ల12 లక్షలకు సంబం ధించిన పనులపై ఆడిట్ నిర్వహించి ప్రజా వేదికలో వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జజ్జరవెల్లి పంచాయతీకి పెనాల్టీ రూ. 3 వేలు, రికవరీ రూ. 27,531, లింగార పంచాయతీకి రూ. 7490 రికవరీకి ఆదేశించారు. గొల్లగట్టు పంచాయతీకి రూ. 1300 రికవరీ, వీరాపూర్ పంచాయతీకి రూ. 38,627, మాడ వెల్లికి రూ. 11, 880, జన్కాపూర్‌కు రూ. 2వేల రికవరీ, రెబ్బెనకు రూ. 14,974 రికవరీ, టేకులపల్లికి రూ. 4666 రికవరీ, పోలంపల్లికి రూ. 25,236 రికవరీ, కన్నెపల్లికి రూ. 9 వేల పెనాల్టీ, రూ. 18279 రికవరీ, నాయకునిపేట పంచాయతీకి రూ. 26,218 రికవరీ, ముత్తాపూర్‌కు రూ 56,212 రికవరి విధించారు. ఇందులో రూ. 2,45,416 రికవరీకి ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వహించానలి, అవకతవకలకు పాల్పడితే చర్యలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఈజీఎస్ విజిలెన్స్ అధికారి కిరణ్, ఎంపీడీవో శంకర్, ఏపీవో శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ సాయిలు, ఈసీ సుధాకర్, టీఏలు, ఎఫ్ఏలు, కార్యదర్శులు,కూలీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి, జూన్27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్‌పోటీలకు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న మామిడి కార్తిక్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయ సాగర్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. నిజామా బాద్ జిల్లాల ఈ నెల 28 నుంచి జులై 2వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర టోర్నమెంట్‌లో పాల్గొంటాడని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన కార్తిక్‌ను ఆదిలాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రఘునాథ్‌రెడ్డి, పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, ఉపాధ్యాయులు అభినందించారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

నెన్నెల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామి పథకంలో పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి కోరారు. మామిడి, బత్తాయి, సపోట, బాదం, సీతాఫలం, దానిమ్మ, కొబ్బరి, జామ, మునగ, అల్లనేరేడు, డ్రాగా న్‌ఫ్రూట్, ఆపిల్‌బేర్, నారింజ, ఆయిల్‌ఫామ్ తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. జాబ్ కార్డు కలిగి ఉండి, ఐదు ఎకరాల లోపు పట్టా భూమి కలిగి ఉన్న చిన్నకారు రైతులు మాత్రమే అర్హులని చెప్పారు. మొక్కలు నాటి సంరక్షించే వారికి నెలకు ఒక్కో మొక్కకు రూ. 12.50 చొప్పున, గరిష్టంగా రూ.3 వేలు చెల్లిస్తారని చెప్పారు. ఆసక్తి గల రైతులు గ్రామ పంచాయితి, మండల పరిషత్తు కార్యాలయాల్లో సంప్రదించాలని ఎంపీడీవో కోరారు.

మంత్రిని విమర్శించడం సరికాదు

మందమర్రిటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక, గనుల, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామిని విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకుడు రాజారమేష్‌కు లేదని కాంగ్రెస్ నాయకులు పైడిమల్ల నర్సింగ్ ధ్వజమెత్తారు. శుక్రవారం మందమర్రిలోని మంత్రి కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ సూర్యుని మీద ఉమ్మేస్తే వారిపైనే పడుతుందన్నారు. ఎవరో మెప్పుల కోసం విమర్శించే ముందు ఆచూతూచి ఆలోచించాలన్నారు. మంత్రిని విమర్శిస్తే ఊరుకోమన్నారు. నియోజకవర్గంలో వందల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతుంటే చూసీ తట్టుకోలేక మంత్రిపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఇకపై విమర్శలు చేస్తే ఊరుకోమన్నారు. ఈ సమావేశంలో నాయకులు సంగి సదానందం, ఎర్ర రాజు, ఎండీ సజ్జు, శంకర్, లక్ష్మణ్, ఇసాక్, విజయ్, గణేష్,కిరణ్, శేఖర్ , రాము తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం ఏర్పాటు

మందమర్రిటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 24వ వార్డు ఊరు మందమర్రిలో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు మినీ సురక్షిత తాగునీటి పథకాన్ని మంత్రి వివేక్‌వెంకటస్వామి చొరవతో ఏర్పాటు చేసినట్లు అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు బండి సదానందం యాదవ్ తెలిపారు. శుక్రవారం తాగునీటి పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వివేక్‌వెంకటస్వా మి పర్యటించగా నీటి సమస్యను విన్నవించగా మిని నీటి పథకం ఏర్పాటు చేసి మోటారు అమర్చామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి కృషి చేస్తున్నారన్నారు.

ఓరియంట్ కార్మికుల ఓటర్లపై అభ్యంతరాలు తెలపాలి

కాసిపేట, జూన్27 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో జరుగబోయే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో భాగంగా ఓటర్ల నమోదులు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆదిలాబాద్ డిప్యూటి లేబర్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. సిమెంట్ కంపెనీలో 266 మంది ఓటర్లు ఉండగా దీనిపై అభ్యంతరాలు ఉంటే ఈ ఏడాది జులై 8వ తేదీ లోపు లేబర్ కమిషనర్ కార్యాలయంలో తెలియజేయాలని 8 కార్మిక సంఘాలకు నోటీసులు అందజేశామని తెలిపారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం ఓరియంట్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జీపీ మల్టీపర్పస్ వర్కర్ల ముందస్తు అరెస్టులు

నెన్నెల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్ తరలి వెల్లడానికి సిద్ధంగా ఉన్న గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లను శుక్రవారం నెన్నెల పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గత కొన్ని నెలలుగా డిమాండ్ల కోసం ప్రభుత్వాన్ని కోరు తున్నాప్పటికి పట్టించుకోవడం లేదని పారిశుధ్య కార్మికులు వాపోయారు. సరిగ్గా జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వారిని సాయంత్రం విడుదల చేశారు.

సీఐటీయూ నాయకుల అరెస్టు

తాండూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మి కుల సమస్యలపై సీఐటీయూ తలపెట్టిన చలో హైద్రాబాద్ ధర్నాకు వెళ్లకుండా సీఐటీయూనాయకులు పోలీసులు ముందస్తు అరెస్టు చేసి తాండూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో ఉద్యమాలు ఆగవని నాయకులు తెలిపారు. అరెస్టు అయిన వారిలో నాయకులు దాగం రాజారాం, సోమ మొగిలి, వేల్పుల శంకర్, బొల్లం రాజేశంలు ఉన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



నెన్నెల ఎఫ్‌పీసీలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ సురేఖ, ఏవో సృజన

నెన్నెల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని భీమిని ఏడీఏ సురేఖ హెచ్చరించారు. మండలంలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తనాలు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం రైతువేదికలో మండల డీలర్లతో సమావేశమయ్యారు. సహకార సంఘం వారు 510 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని కోరగా, ఇప్పటికే 250 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. సీజన్‌కు సరిపడ విత్తనాలు, ఎరువులను డీలర్లు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆమోదిత విత్తనాలను అమ్మి.. రైతులకు విధిగా పూర్తి వివరాలతో కూడిన రసీదు ఇవ్వాలని, గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువకు విక్రయించకూడదని సూచించారు. దుకాణం ఎదుట ధరలు, స్టాక్ వివరాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అమ్మకాలు, రైతుల వివరాలను ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. ఏడీఏ వెంట మండల వ్యవసాయ అధికారి సృజన ఉన్నారు.

మంత్రి, ఎంపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం



మంత్రి, ఎంపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి, మంత్రి తనయుడు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటాలకు శుక్రవారం మందమర్రిలో అఖిల భారత యాదవ సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. నాయకులు బండి సదానందం యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, విద్య, వైద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు.

పాలకవర్గం లేని మందమర్రి మున్సిపాలిటీలో దాదాపు రూ. 75 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్ది రాజన్న పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సిద్ధం



నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు

జైపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మానవ మనుగడకు చెట్లను పెంచి కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించడానికి మొక్కలు నాటే కార్యక్రమమే వన మహోత్సవం.. వనమహోత్సంలో చెట్ల ఆవశ్యకతను తెలియజేస్తూ మొక్కలను పెంచుతున్నారు. వర్షాకాలం ప్రారంభంలో పూలు, పండ్లు, ఇతర మొక్కలను నాటేందుకు వేసవిలో విత్తనాలను సమకూర్చుకుని ఉపాధి హామీ పథకంలో నర్సరీ కూలీలను వినియోగించుకుని నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు.

అన్నిగ్రామాల్లో నర్సరీలు

మండలంలోని 20 గ్రామపంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి ఒక్కో నర్సరీకి వన సేవకున్ని నియమించి నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు వీరిని పర్యవేక్షిస్తుంటారు. వర్షాకాలంలో వన మహోత్స వాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి నర్సరీ నుంచి మొక్కలను తీసుకుని గ్రామాల్లోని ఇంటిం టికి ప్రధాన రోడ్ల వెంట అధికారుల కార్యాల యాల్లో, పలు చోట్ల మొక్కలను నాటనున్నారు.

కాలుష్య రహిత పర్యావరణమే లక్ష్యం

రోజు రోజుకు వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కల పెంపకాన్ని చేపట్టాయి. గాలి కాలుష్యాన్ని నివారించేందుకు చెట్లే ప్రధాన వనరు. ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులకు గుర్తుగా తప్పనిసరిగా మొక్కలు నాటాలని అధికారులు, ఎన్‌జీవోలు పనిచేస్తున్నాయి. ఇందుకు ప్రతి వర్షాకాలం ప్రారంభంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం విధిగా చేసి నర్సరీల్లో మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు నాటేం దుకు సిద్ధంగా ఉన్నాయి.

మొక్కలను సిద్ధం చేస్తున్నాం

సుమన్, ఇందారం గ్రామపంచాయతీ కార్యదర్శి



ప్రతియేటా వర్షాకాలం ఆరంభంలో ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమానికి మొక్కలు సిద్ధం చేస్తున్నాం. వన మహోత్సవానికి ఆరోగ్యమైన మొ క్కలను పంపిణీ చేస్తున్నారు. మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేయడంతో పాటు గ్రామంలోని ప్రధాన రోడ్ల వెంట మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అధికారులు, గ్రామస్థుల సహకారంతో నర్సరీని ప్రతి సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్నాం.



స్థానిక సమరానికి సమాయత్తం

- హైకోర్టు తీర్పుతో కదలిక
- గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి షురూ
- ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్న అధికారులు
- వ్యూహరచనలో రాజకీయ పార్టీల నాయకులు

గ్రామ పంచాయతీలకు సెప్టెంబరు 30 లోపు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు తీర్పులో గ్రామాల్లో ఆశావహులు సమరానికి సిద్ధమవుతున్నారు. ఏడాదిన్నరగా ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామీణ ప్రాంతాల పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయని, ప్రజాప్రతినిధులు లేకపోవడంతో సమస్యలను పట్టిం చుకునేవారే లేకుండా పోయారని ప్రజలు పలు సంద ర్భాల్లో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైకోర్టు తీర్పుతో ఎన్నికల నిర్వాహణలో కదలిక వచ్చింది.

చింతలమానేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని బుధవారం హైకోర్టు కీలకమైన తీర్పు ఇవ్వడంతో జిల్లాలో ఎన్నికల సందడి మొదలైంది. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడా..? అని ఎదురు చూసిన ఆశావహుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికలకు సన్నద్ధం అవుతున్నాయి. జిల్లా యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లను ఇప్పటికే సిద్ధం చేసింది. ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినా నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నాయి. అరవై రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశించడంతో ఎన్నికల నిర్వహణ అనివార్యంగా మారింది. దీంతో అధికార యంత్రాంగం, పలు ప్రధాన పార్టీల్లోనూ కదలిక మొదలైంది. సెప్టెంబరులో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానున్నది. ఆ లోగా అన్ని ఏర్పాట్లతో సర్వసన్నద్ధంగా ఉండేందుకు పార్టీలు సిద్ధం అవుతున్నాయి.

15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో మొత్తం 335 గ్రామ పంచాయతీ స్థానాలుండగా, వార్డు సభ్యుల స్థానాలు 2,874 ఉన్నాయి. పంచాయతీ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయి. 137 ఎంపీటీసీ స్థానాలు, 15 జడ్పీటీసీ స్థానాలున్నాయి. ఇందులో సిర్పూర్ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు 320, పురుష ఓటర్లు 1,15,323 మహిళా ఓటర్లు 1,15,811 ఇతరులు 16 మంది ఉండగా మొత్తం 2,31,150 ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు 358 పురుష ఓటర్లు 1,13,815 మహిళా ఓటర్లు 1,15,813 ఇతరులు 16 మంది ఉండగా మొత్తం 2,29,644 ఉన్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలు 678 పురుష ఓటర్లు 2,29,138 మహిళా ఓటర్లు 2,31,624 ట్రాన్స్ జెండర్స్ 32 మంది మొత్తం మంది ఓటర్లు 4,60,794 ఉన్నారు. ఇంకా అర్హులైన వారు ఓటరు నమోదుకు అవకాశం ఇవ్వడంతో మరింత పెరిగే అవకాశం ఉన్నది.

ఇప్పటికే ఓటర్ల జాబితా తయారు..

పంచాయతీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం ఇప్పటి కే ఓటర్ల జాబితా తయారు చేసి సిద్ధంగా ఉంది. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది నియామకం కూడా పూర్తయింది. వారికి శిక్షణ సైతం నిర్వహిం చారు. ఈ మధ్య కాలంలో బదిలీలు జరిగినందువల్ల గతంలో విధులు అప్పగించిన ఉద్యోగుల్లో మార్పులు చేర్పులు ఏమైనా జరిగాయా..అని ఎన్నికల సంఘం ఆరా తీసింది. అధికారులు వివరాలను టీ-పోల్‌లో నమోదు చేశారు. ఒక్కో రెవెన్యూ డివిజన్లో ఒక్క విడతలో ఎన్నికలు ఉండనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2వేల పైనే సిబ్బంది అవసరం ఉండవచ్చని అంచనా.

తేదీలు ఖరారు కాకున్నా..

ఎన్నికల తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించకున్నప్పటికీ ఆశావహులు మాత్రం తమ ప్రయత్నాలు ప్రారంభించారు. ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు మొదలు పెట్టారు. మరో రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, అప్పటి వరకు ఆగడం ఎందుకన్నట్లు ప్రచార కార్యక్రమాల్లో మునిగిపోతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. ఆశా వహులు తమ బలాన్ని, బలగాన్ని కూడగట్టుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే నాటికి అన్ని సిద్ధం చేసుకోవాలని భావిస్తున్నారు.

వ్యూహరచనలో ప్రధాన పార్టీలు..

స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా పట్టు నిలుపుకునేందుకు ఆయా పార్టీల్లోని ముఖ్య నేతలు వ్యూహరచన చేసుకుంటున్నారు. జిల్లాలో సిర్పూర్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి ఎమ్మె ల్యే పాల్వాయి హరీష్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తుం డగా, బీఆర్ఎస్ నుంచి ఆసిఫాబాద్ నియోజక వర్గానికి కోవ లక్ష్మి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. కానీ గ్రామాల్లో తమ ఎమ్మెల్యే ఎవరిని అభ్యర్థులను నిలబెడితే వారిదే గెలుపు అన్న ధీమాలో వారి వారి పార్టీలకు చెందిన ఆయా అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం రాష్ట్రంలో అధికారంలో ఉండడం, ఏడాదిన్నర కాలంగా మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రుణ మాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నరకం ధాన్యానికి బోనస్ రూ. 500 వంటి పథకాల అమలు తమకు అనుకూలిస్తాయని కాంగ్రెస్ ఆశావహ అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ఎన్నికల ముందుకు పోయేందుకు సిద్ధం చేసుకుంటున్నాయి. ముఖ్యంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య విభేదాల కారణంగా తమకు అనుకూలంగా ఉండే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నారు.

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఆసిఫాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. జిల్లాలో 946 మంది విద్యార్థులు హాజరయ్యా రు. 573 మంది బాలురు, 355 మంది బాలికలు ఉన్నారు. మొత్తంగా 573 మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది.

అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఏఎస్పీ చిత్తరంజన్, పాల్గొన్న సీఐ రవీందర్, ఎస్సై అంజయ్య

ఆసిఫాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అక్ర కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మానవ అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల మానవ అక్రమ రవాణా కేసులో 10 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని చెప్పారు. పది రోజుల క్రితం 8 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని తెలిపారు. ఇదే కేసులో మధ్యప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరు నిందితుల కోసం దర్యాప్తు చేయగా శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలోని బస్టాండు ఏరియాలో ఏ7 బబీర్ రమేష్‌గౌడ్, ఏ9 జగదీష్‌సోనీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మానవ అక్రమ రవాణా కేసుల్లో నిందితుడిగా ఉన్న కానిస్టేబుల్ హరిదాసును విధుల్లో నుంచి శాశ్వతంగా తొలగించామని చెప్పారు. జిల్లాలో మానవ అక్రమ రవాణా, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ రవీందర్, ఎస్సై అంజయ్య పాల్గొన్నారు.

ఘనంగా బొజ్జాతారకం జయంతి

వాంకిడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో మలి విడత దళిత ఉద్యమ నాయకుడు, పౌరహక్కుల నేత, న్యాయవాది బొజ్జా తారకం జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ నాయకులు అశోక్, దుర్గాజీ, విజయ్, శ్యాంరావు, సందీప్, రాజేశ్వర్, ప్రశాంత్, రోషన్, ప్రతాప్, దీపక్, మనోజ్, సురేందర్, రమేష్, మనోజ్, నూతన్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం



శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయం

బెజ్జూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి రైతులకు, విద్యార్థులకు వివిధ రకాల సేవలు అందిస్తోన్న తహసీల్దార్ కార్యాలయం శథిలావస్థకు చేరడంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని కింది గచ్చు పూర్తిగా ఊడిపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతు న్నారు. గత రెండేళ్ల నుంచి కింద వేసిన టైల్స్ పూర్తిగా పగిలిపోయి మట్టి బయటకు రావడంతో నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. కాగా పదిహేనేళ్ల క్రితం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంటోంది. రెండేళ్ల నుంచి టైల్స్ పూర్తిగా చెడిపోవడంతో అధికారులు మరమ్మతులు చేయకపోవడం తో అవస్థలు తప్పడం లేదు. మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినా నిధులు మంజూరు కావ డం లేదని అధికారులు వాపోతున్నారు. కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు, అధికారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షాలకు పైనుంచి వర్షపు నీరు కూడా ఊరుస్తుండటంతో కంప్యూటర్లు, వివిధ రకాల దస్త్రాలు తడిచిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. (అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రామ్మోహన్‌ను వివరణ కోరగా తాను ఇటీవలే బదిలీపై వచ్చానని మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

బోగస్ జాబ్‌కార్డులు తొలగించాలి



ప్రజావేదికలో వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

కెరమెరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో బోగస్ జాబ్‌కార్డులు తొలగించాలని డీఆర్‌డీవో పీడీ దత్తారావును తనిఖీ అధికారులు ఆదేశించారు. మండల కేంద్రలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. ఉపాధిహా మీ పథకంలో మండల వ్యాప్తంగా 1 ఏప్రిల్ 2024 నుంచి 31.02.25 వరకు 513 పనులు నిర్వహించారు. అందుకు గాను రూ.9.70 కోట్ల నిధులను కేటాయించారు. ఈ సందర్భంగా అట్టి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం ఈ నెల 16 నుంచి 26 వరకు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పనులను పర్యవేక్షించారు. కాగా శుక్రవారం ప్రజావేదిక నిర్వహించారు. మొత్తం 31 గ్రా పంచాయతీల్లో పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పనుల్లో చాలా గ్రామాల్లో బోగస్ జాబ్‌కార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని వెంటనే రద్దు చేయాలని డీఆర్‌డీవో పీడీ దత్తారావును ఆదేశించారు. అలాగే ఉపాధి హామి పనుల్లో స్థానిక ఎఫ్ఏలు, మేట్లతో కలిసి వారి కుటుంబ సభ్యుల పేరిట జాబ్ కార్డులు సృష్టించి డబ్బులు స్వాహా చేసినట్లు అధికారులు గుర్తించారు. మరికొన్ని గ్రామాల్లో గ్రామ కార్యదర్శుల సంతకాలు లేకుండా జాబ్ కార్డులు సృష్టించినట్లు ప్రజావేదికలో వెలుగు చూశాయి. కేస్లాగూడ గ్రామ పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా జాబ్ కార్డులు సృషించారన్నారు. కాగా సాయంత్రం 7 గంటల వరకు 20 గ్రామపంచాయతీలకు సంబంధించిన ఆడిట్ పూర్తి కాగా మరిగితా 11 గ్రామ పంచాయతీల ఆడిట్ కొనసాగుతోంది. కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తారాం, సోషల్ ఆడిట్ డైరెక్టర్ నిర్మల, ఎస్ఆర్పీ రవియాదవ్, ఎంపీడీవో అంజద్‌పాషా, డీవీఓ ఆంజనేయులు, హెచ్ఆర్ అకౌంటెంట్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నీతి ఆయోగ్‌లో తిర్యాణికి జాతీయ స్థాయిలో నాలుగో స్థానం

ఆసిఫాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి మండలం శుక్రవారం నీతి ఆయోగ్ విడుదల చేసిన ర్యాంకింగ్‌లో జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. దక్షణ జోన్ స్థాయిలో తిర్యాణికి మొదటి స్థానం లభించింది. నీతి ఆయోగ్ విడుదల చేసిన మార్చి 2025 త్రైమాసికపు తాజా డేటా ర్యాకింగ్స్‌లో దేశ వ్యాప్తంగా ఉన్న 500 ఆకాంక్షిత బ్లాక్‌లలో తిర్యాణి మండలం దక్షణ జోన్‌లో మొదటి స్థానం ఓవరాల్‌గా నాలుగో స్థానం సాధించింది. ఈ అద్భుతమైన పని తీరుకు గాను తిర్యాణి మండలానికి కోటి రూపాయల గ్రాంట్స్ లభించింది. ఈ నిదులను మండలంలోని అభివృద్ధి పనులకు వినియోగించనున్నారు. గతంలో డిసెంబరు 2023లో విడులైన తొలి ఏపీపీ(యాస్పరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం) డేటా ర్యాంకింగ్‌లో టాప్ ర్యాంక్ సాధించడంతో రూ. మూడు కోట్లు పొందింది. ఈ విజయమాన్ని నీతి అయోగ్ వాల్ ఆఫ్ ఫేమ్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. గతంలో మంజూరు అయిన రూ. మూడు కోట్ల గ్రాంట్‌ను మండలంలోని వివిధ అభివృద్ధి పనులకు ప్రస్తుతం వినియోగిస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్ మాట్లాడుతూ ఈ విజయం సాధించడానికి కృషి చేసిన మండలాధికారులందరికి అభినందనలు తెలిపారు. అధికారుల సమష్టి కృషితోనే సాధ్యమైందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని మిగిలా మండలాల్లో అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సిబ్బందిసైతం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు.

గిరిజన సహకార ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

» నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ » సొసైటీ పరిధిలో 1,553 మంది ఓటర్లు



ఆసిఫాబాద్‌లోని జీసీసీ కార్యాలయం

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థలో ఆసిఫాబాద్ గిరిజన సహకార మార్కెటింగ్ పాలకవర్గానికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. జూలై 9న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆసిఫాబాద్ గిరిజన సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్‌లో ఐదుగురు డైరెక్టర్లను ఓటింగ్ ద్వారా ఎన్నుకోనున్నారు. ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు ఉం టారు. ఆసిఫాబాద్ గిరి జన సహకార మార్కెటింగ్ సంఘం పరిధిలో 1,553 మంది ఓటర్లు ఉన్నారు.

షెడ్యూల్ ఇలా..

ఆసిఫబాద్ గిరిజన సహకార మార్కెటింగ్ పాలకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ ఇలా ఉంది. ఈనెల 28 నుంచి జూలై 1 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జిల్లా కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారు. చివరి రోజున నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హులైన వారి జాబితాను ప్రకటిస్తారు. జూలై 3న నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం అర్హులైన వారి జాబితాను ప్రకటిస్తారు. ఎన్నికల గుర్తులను కేటాయిస్తారు. జూలై 9న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. సాయంత్రం ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు.

డైరెక్టర్ల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి..

ఆసిఫాబాద్ గిరిజన సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ డైరెక్టర్ల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశాం. శనివారం నుంచి జూలై 1 వరకు నామినేషన్లను స్వీకరించనున్నాం. జూలై 9న ఎన్నికలు నిర్వహిస్తాం. అదే రోజు ఫలితాలు ప్రకటిస్తాం.

- బి మోహన్, ఎన్నికల అధికారి

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మేనేజర్ నవీన్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):పీఎంఎఫ్ఎంఈ (ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫ/డ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వయం సంఘాల సభ్యులు ఆర్థిక సాధికారత సాధించేందుకు ఆహార శుద్ధి రంగం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తుందన్నారు. ఒక్కో యూనిట్‌కు గరిష్ఠంగా రూ. 10 లక్షల వరకు 35 శాతం సబ్సిడీతో రుణం లభిస్తుందన్నారు. చిన్న తరహా పరిశ్రమలను స్థాపించుకొంటే మార్కెటింగ్, ఉత్పత్తుల బ్రాండింగ్, ప్యాకేజీ రంగాల్లో మద్దతు లభిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ (డిఎంసి) మోతీరాం, డీఆర్పి శివసాయి, రిసోర్స్ పర్సన్, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన లోలెవల్ వంతెన



లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

కెరమెరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం కురిసిన వర్షానికి కేలి(బి)- సాంగ్వీ గ్రామాల మధ్య వాగుపై ఉన్న లోలెవల్ వంతెన ఉప్పొంగడంతో సుమారు గంట పాటు రాక పోకలు నిలిచిపోయాయి. ఈ వాగు అవతలివైపు మహారాష్ట్రలోని జీవితి, అలాగే మండ లంలోని ఇందాపూర్, ఖైరి, కేలి(బి) ,కేలి(కె) గ్రామాల ఉంటాయి. లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు ఉప్పొంగి ప్రవహించడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత



గుంతలను పూడ్చివేస్తున్న అధికారులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

సిర్పూర్(టి), , జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిపై గుంతలను ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పూడ్చివేశారు. గుంతలతో రోడ్డు ప్రమాదకరంగా మారిందని 'ఆంధ్రజ్యోతి' టాబ్లాయిడ్‌లో శుక్రవారం సంచికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పోలీసులు ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో గుంతల్లో కంకర, మొరం పోయించి చదును చేయించారు.

వర్షాలకు తెగిన కల్వర్టు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజురా వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకి పూర్తిగా కొట్టుకు పోయింది. దీంతో రాజురా గ్రామ ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఆయా పాఠశాలలకు వచ్చే విద్యార్థులు, రైతులకు చాలా ఇబ్బందిగా మారింది.



తెగిన కల్వర్టు